

30న రైతు సమస్యలపై మహాధర్నాలు

ప్రజాశక్తి- రాయచోటి

రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 30న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాలను విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురి రామచంద్ర తెలిపారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ బిగ్‌సి వద్ద మహాధర్నా జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 30న ఉదయం 10 గంటలకు విజయవాడలో మహా ధర్నా చేపడుతున్నామని చెప్పారు. గత ఏడాది రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల పంటల బీమా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు పెట్టిన ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి కనీసం మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. అన్ని రకాల భూ సమస్యలను వెంటనే పరిష్కరించి, నకిలీ విత్తనాలు చలామణిలో రాకుండా ప్రభుత్వ వెంటనే చర్యలు తీసుకోవాలి కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడునాగ బసిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌జ్యోతి పథకం కత్తిరింపులకు గురైంది. గత టిడిపి ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేసిన సంగతి తెలిసిందే. గతేడాది తలెత్తిన ఆర్థిక ఇక్కట్ల నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం కత్తిరింపులకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలోని దళిత కాలనీలు, తాండాల్లోని వినియోగదారుల గుర్తించే సర్వేను పూర్తి చేసిన అనంతరం వేలాది మంది దళితుల విద్యుత్ సర్వీసులకు మొండిచేయి చూపించింది. ఫలితంగా జిల్లాలోని వేలాది మంది ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాల్లో జగ్జీవన్‌జ్యోతి కొడిగట్టిన నేపథ్యంలో కథనం..

జిల్లాపై రూ.12.74 కోట్ల భారం?

ఉమ్మడి జిల్లాలో 1.12 లక్షల కనెక్షన్లు

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలో కడప, రాజంపేట, రాయచోటి, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్లు న్నాయి. వీటి పరిధిలోని 20 సబ్ డివిజన్లలో 1.12 లక్షల ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే ఎస్‌సి, ఎస్‌టిలకు జగ్జీవన్‌జ్యోతి పథకం కింద పలువురికి ఉచిత విద్యుత్ ప్రయోజనం లభిస్తోంది. ప్రభుత్వం గతేడాది నుంచి జగ్జీవన్‌జ్యోతి పథకం ప్రయోజనాలను దళితవాడలు, దళిత కాలనీలకు మాత్రమే వర్తింపజేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఫలితంగా జిల్లాలోని పట్టణ శివార్లలో జీవనం సాగిస్తున్న లక్షలాది మంది ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులను ఉన్నతాదాయం కలిగిన వారి జాబితాలో చేర్చి సుమారు మూడు నుంచి ఐదు రకాల ఛార్జీలను వసూలు చేస్తుండ డం ఆందోళన కలిగిస్తోంది.

ఈ ఏడాది జూన్ నెలాఖరులోపు సర్వేను పూర్తి



చేసింది. జిల్లాలో ఆరు డివిజన్ల పరిధిలోని ప్రొద్దుటూరు 20,796, మైదుకూరు డివిజన్ పరిధిలో 21,456, కడప డివిజన్లలో 12,123, రాజంపేట డివిజన్‌లో 20,774 అత్యధికంగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జగ్జీవన్‌జ్యోతి స్కీమ్ నిర్వహణపై సర్వే చేసిన అనంతరం పూర్తిస్థాయి బిల్లుల వసూలు చేస్తోంది. పెట్రో, గ్యాస్, విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలను పెంచుతూ సామాన్యులపై భారాలు మోపుతోంది. ఫలితంగా నిత్యావసరాల ధరలు పెరిగి నిరసనలు మిన్నంటిన నేపథ్యంలో జగ్జీవన్‌జ్యోతి పథకం నిబంధనల పేరుతో భారం మోపడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల్లో నివసించే దళితులకు జగ్జీవన్‌జ్యోతి పథకం దూరమైంది. పట్టణ శివారు ప్రాంతాల్లో ఉన్న దళిత కాలనీలకు వర్తించడం లేదని తెలుస్తోంది. ఫలితంగా జిల్లాలోని 1,1,215 ఎస్‌సి, ఎస్‌టి కనెక్షన్లు కలిగిన విద్యుత్ వినియోగదారులపై రూ.12.74 కోట్లు భారం పడనుంది. గతేడాది నుంచి దళిత విద్యుత్ సర్వీసుల కుదింపులకు గురైన నేపథ్యంలో రూ.3.47 కోట్లు మాత్రమే భారాన్ని భరి స్తున్నట్లు తెలు స్తోంది. ఈలెక్కన రూ. 8.26 కోట్లు మేర వసూలు చేస్తున్నట్లు ఓ అంచనా. జగ్జీవన్‌జ్యోతి పథకం నిబంధనల ప్రకారం దళిత తాండాలు, దళిత కాలనీలకు మాత్రమే వర్తింపు పేరుతో పట్టణ ప్రాంతాలకు లోపల, వెలుపల ఉండే దళితులు నష్టపోతున్నారు. ఎపి ట్రాన్స్‌కో ఎస్‌ఇ రమణ ఫోన్‌లో సంప్రదించగా జగ్జీవన్‌జ్యోతి పథకం కింద సర్వే చేసిన మాట వాస్తవమేనని, ఎంతమంది అనర్హులుగా తేలారో చూడాల్సి ఉందని పేర్కొనడం గమనార్హం.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ శైలజ

ప్రజాశక్తి-రాయటోటి టౌన్

ఆపదలో సమయంలో రక్తదానం చేయ డానికి యువత ముందుకు రావాలని అదనపు డిఎం హెచ్‌ఒ డాక్టర్ ఒ.శైలజ అన్నారు. కార్మిక ఉద్యమ నిర్మాత పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్స వాల్లో భాగంగా సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదాన శిబిరం లో 23 యూనిట్ల రక్తాన్ని సేకరించడం అభినంద నీయమని ఆపదలోని పేదలకు దీప బ్లడ్ బ్యాంక్ వారికి వితరణ చేయడం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వ్యక్తిలో కొత్త రక్త కణాలు ఉత్పత్తి అయి ఇమ్యూనిటీ పెరుగుతుందని తెలిపారు. రక్తం కోల్పోయి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుకోవడానికి ఉపయోగమన్నారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేసి సమాజ మనుగడకు కృషి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎడిఎంహెచ్‌ఒ డాక్టర్ శైలజ

చేయాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు మాట్లాడుతూ కార్మిక, కర్షకుల హక్కులు, చట్టాల కోసమే గాక ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో వెనుకంజ వేయదని తెలిపారు. కరోనా కాలంలో లక్షలాది రూపాయల సరుకులు పంపిణీ చేసిన సిఐటియు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు ప్రజానీకం కొరకు చేస్తామన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కం ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యంరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.జాన్ ప్రసాద్, ఎఐఎస్‌ఎ విద్యార్థి సంఘం అధ్యక్షులు కిరణ్ రక్తదానం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, శ్రీదీప బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఒపిడిఆర్ నాయకులు టి.ఈశ్వర్, ఓబులమ్మ, జిల్లా కార్యదర్శి డి.భాగ్య లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఫయాజ్, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు బసిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర, సిఐటియు నాయకులు భాస్కర్, ఖాజాబి, సిద్దమ్మ, అరుణ, గజా నాయుడు, సుమంత్, శ్రీనివాసులు, సాయి, రామకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.



నందలూరు సౌమ్యనాథ ఆలయం (ఇన్‌సెల్‌లో) స్వామి మూలవిరాట్

సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

నేడు అంకురార్పణ - జులై 7 వరకు సేవలు

4న కల్యాణం, 5న రథోత్సవం

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో అత్యంత ప్రాశస్త్యం పొందిన ఆలయాలలో ఒకటైన సౌమ్యనాథ స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనమై మొదటిసారిగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మంగళవారం రాత్రి అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జులై ఏడవ తేదీ వరకూ కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా అన్ని చర్యలు చేపట్టారు. వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో రానున్నారు. అందుకు తగ్గట్టుగా సన్నాహాలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 28న ధ్వజారోహణం, డోలోత్సవం, యాళీవాహన సేవ, 29న స్నపన తిరుమంజనం, హంస వాహన సేవ, 30న పల్లకి ఉత్సవం, సింహ వాహన సేవ, జులైన ఒకటిన పల్లకి ఉత్సవం, స్నపన తిరుమంజనం, హనుమద్వాహన సేవ, 2న శేష వాహనం, గరుడ వాహన సేవ, 3న సూర్య ప్రభ వాహన, చంద్ర ప్రభ వాహన సేవలు ఉంటాయి. 4వ తేదీన ఉదయం కల్యాణోత్సవం ఉంటుంది. రాత్రి గజ వాహన సేవ, 5న రథోత్సవం, అశ్వ వాహన సేవ, 6న చక్రస్నానం ధ్వజవరోహణం, మహా పూర్ణాహుతి, 7న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఇఒ నటేషన్ పేర్కొన్నారు.

సౌమ్యనాథునికి ముత్యాల తలంబ్రాలు అందజేత

శ్రీసౌమ్యనాథ స్వామి కల్యాణోత్సవానికి ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి దంపతులు సోమవారం ముందస్తుగా ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ నటేషన్, వైసిపి నాయకులు నడివీధి సుధాకర్, సోమిశెట్టి ప్రభాకర్, తుమ్మల శ్రీధర్ గౌడ్, కాకి చంద్ర, అరిగె నాని, నాగసుబ్బయ్య పాల్గొన్నారు.



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి దంపతులు

జెవికెను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకులు

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధి లోని ఆదర్శ పాఠశాలను రాష్ట్ర సర్వ శిక్ష అభియాన్ పరిశీల కులు మహేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ సోమవారం జగనన్న విద్యా కానుక పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ జెవికె కొలతలపై అవ గాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థికి వర్క్ బుక్స్ కచ్చితంగా రాపించాలని ఉపా ధ్యాయులకు సూచిం చారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. ప్రభుత్వం సూచిస్తున్న విధంగానే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులను జగనన్న విద్యా కానుక గురించి అడిగి తెలుసు కున్నారు. పాఠశాల ప్రారంభం రోజుని జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజే శామన్నారు. జెవికెలో ఎటువంటి ఔకతవకలకు తావు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



జెవికెను పరిశీలిస్తున్న ఎస్‌ఎస్‌ఎ రాష్ట్ర పరిశీలకులు

తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ చక్కటి పథకాలను వినియో గించుకుని విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగ తిరుమలరావు, కళాశాల ప్రిన్సిపల్ లీల శ్రీహరి సిఆర్‌పిలు ఆనంద్, శివ, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులశ్రష్ట పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఆర్థిక సాయం : గిరీష



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

రాయచోటి: జూనియర్ న్యాయవాదులను ప్రోత్స హిస్తూ వృత్తిలో స్థిరపడేలా ప్రభుత్వం 'వైఎస్‌ఆర్ లా నేస్తం' ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తుందని కలెక్టర్ గిరీష అన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్‌ఆర్ లా నేస్తం ద్వారా రాష్ట్రంలోని అర్హులైన 2,677 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేలు చొప్పున ఫిబ్రవరి 2023 నుంచి జూన్ 2023 వరకు ఒకొక్కరికి రూ.25 వేలను వారి ఖాతాలోల రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయాల కో-ఆర్డినేటర్ మనోహరరాజు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ చేశారు. రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద రాష్ట్రంలో అర్హులైన 2,677 మంది జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక సాయం ప్రభుత్వం విడుదల చేసింది అన్నారు. వృత్తిపరంగా యువ న్యాయవాదుల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా వైఎస్‌ఆర్‌లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారని, అర్హులైన యువ న్యాయవాదులకు మూడేళ్ల పాటు నెలకు ఐదు వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేలా ఏకకాలంలో యువ న్యాయవాదులు పెద్ద మొత్తం సొమ్ము అందుకుని వారి అవసరాలు తీర్చుకునేందుకు ఉపయోగపడేలా ప్రతి ఆరు నెలలకోసారి బటన్ నొక్కి లబ్ధి అందించేలా పథకంలో మార్పులు చేశారన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, గ్రామ ,వార్డు సచివాలయాల కో-ఆర్డినేటర్ మనోహరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి -రాయచోటి

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గిరిష మెడికల్ ఆఫ సర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి కలెక్టర్ మెడికల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యాభి వృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని వైద్యులు సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య మందించి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. రోజూ ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారని వ్యాధి వివరాలు, వారికి ఏమేమి మందులు ఇచ్చారు.. తదితర వివరాలన్నీ రికార్డులలో ఎప్పటికప్పుడూ నమోదు చేయాలన్నారు. జిల్లాలో రక్తహీనతలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత నివారణకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ టెస్టింగ్ లాబ్ పనిచేసేలా చర్యలు తీసుకో వాలని పేర్కొన్నారు. ఆసుపత్రులకు ఇచ్చిన ఫ్రిజ్ లలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

పేర్కొన్నారు. ప్రతి ఆసుపత్రికి వచ్చే మందుల స్టాక్ వివరాలు, వాటి కాల పరిమితి డేట్ తప్పకుండా ఉండేలా చూడాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు, అంగన్వాడీ కేంద్రాలలో ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను వేసుకునేలా చూడాలని చెప్పారు. వారికి క్రమం తప్పక పౌష్టికాహారం అందించాలన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనిమియా పేషెంట్లు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్ ఉపయోగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మైనార్టీలకు సముచిత స్థానం

- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం/గుర్రంకొండ

రాష్ట్రంలో మైనార్టీలకు పరిపాలనలో సము చిత స్థానం, ప్రాధాన్యతను, గౌరవాన్ని కల్పించింది ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం గుర్రంకొండ మండలం సరిమడుగు పంచాయతీలో గడపగడపకూ మన ప్రభు త్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింత లను కలసి దుశ్శాలవతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మైనార్టీల అభ్యున్నతికి, సంక్షేమానికి అంకిత భావంతో చేయూతనందిస్తున్నట్లు తెలి పారు. వైసిపి ఆవిర్భావం నుంచి మైనార్టీలు తమ పార్టీకి అండ దండగానే ఉండారని, రానున్న ఎన్నికల్లోనూ సంపూర్ణ మద్దతుతో అఖండ విజయాన్ని చేకూర్చనున్నట్లు తెలిపారు. మైనార్టీల



మిథున్‌రెడ్డి, చింతలను సన్మానిస్తున్న అబ్దుల్ కలీమ్

సామాజిక అభివృద్ధి నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రత్యేక సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చేందుకు యోచిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవి నాయక్, పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, నాయకులు ముక్తియార్ అలీ ఖాన్, నక్కా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు సేవ చేయడం అదృష్టం

- సిబిఐ మాజీ జెడి వి.వి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెలుగు ప్రత్యేక పాఠశాల, వెలుగు వృద్ధాశ్రమం ద్వారా సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి ఎంతో మంది వృద్ధులు, చిన్నారులకు వెలుగునిస్తున్నారని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని అమ్మచెరువు మిట్ట నందు వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఆయనకు చిన్నారులు, వృద్ధ మహిళలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఉదయ్ మోహన్‌రెడ్డి వెలుగు సంస్థ ప్రారంభం నుంచి చేసిన సేవలను వివరించారు. వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులను ప్రేమతో పలకరించి వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అందరు సంతోషంగా ఉన్నారనీ అదేవిధంగా మీరందరూ సదాకాలం సంతోషంగా ఉండాలన్నారు. వృద్ధులకు బెడ్ షీట్లను అందజేశారు. అనంతరం వెలుగు ప్రత్యేక పాఠశాల తరగతులను వారి యొక్క విద్యాబోధనలను గురించి తెలుసుకున్నారు. పిల్లలు తయారు చేస్తున్న అగర్బత్తీలను చూసి ప్రశంసించారు. ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది ఎంతో కష్టమైన ఇష్టంగా చేస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపల్ లీనా కుమారి వెలుగు కార్యకలాపాల గురించి తెలియజేశారు. అనంతరం వి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంతమంది దివ్యాంగులకు విద్యాబుద్ధులు చెప్పడం, వృద్ధులకు సేవ చేయడం ఎంతో గొప్ప



సమావేశంలో మాట్లాడుతున్న వి.వి.లక్ష్మీనారాయణ

విషయమనీ వెలుగు నిర్వాహకులను అభినందించారు. అనంతరం దివ్యాంగులకు పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో వి.వి.లక్ష్మీనారాయణ చేతుల మీదుగా యూనిఫాంలు అందజేశారు. వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి వి.వి.లక్ష్మీనారాయణకు మొమెంటోను అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, జె.డి.ఫౌండేషన్ టీం భవాని, ఫోర్డ్ డైరెక్టర్ లలితమ్మ, కూరపర్తి శ్రీసాయి చైతన్య ఆశ్రమ నిర్వాహకులు పద్మనాభరెడ్డి, ధాత్రి ఫౌండేషన్ చక్రపాణి, రమణ, పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్, ప్రకృతివనం ప్రసాద్, వెలుగు సిబ్బంది, పిల్లలు, వృద్ధులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధర్‌రావు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి గంగాధర్‌రావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయించే వారి పై తప్పనిసరిగా పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని చెప్పారు. రెండేళ్ల నుంచి అన్నమయ్య జిల్లాలో గంజాయి విక్రయస్తున్న వారి కదలికలపైన నిఘా పెట్టామని అందులో భాగంగా నలుగురు గంజాయి విక్రయించే వారిలో ఎటువంటి మార్పు లేనందున పీడీయాక్టు నమోదు కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. స్పందించిన కలెక్టర్ నలుగురిపై పీడీ యాక్టు నమోదుకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. యువత మత్తుకు బానిస అయ్యి వారి బంగారు భవిష్యత్తు పాడు చేసుకుంటున్నారని, మత్తుకు బానిస అవ్వకుండ బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మిన, కొన్నా, రవాణా చేసిన వారిని గుర్తించామని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలో హోర్డింగుల్ల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఎటువంటి సమాచారం ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 14500 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. మత్తు వల్ల మనిషి విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే ప్రమాదముందని చెప్పారు. అన్నమయ్య జిల్లాను గంజాయి రహిత జిల్లాగా పేరు తీసుకొని రావాలని పిలుపు నిచ్చించారు.

'పద్మా' అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానం

రాయచోటి: యువజన సర్వీసుల శాఖ, విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు, 2024 పద్మా అవార్డులు అనగా పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీల అవార్డుల కోసం 'సామాజిక సేవా రంగం'లో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్టెప్ సిఇఒ సాయిగ్రేస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు https://awards.gov.in ద్వారా కానీ, నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు స్టెప్ మేనేజర్‌వి.వి. సుబ్బరాయుడు 9949298810ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వైద్యాధికారిగా రామానుజన్ నాయక్

ప్రజాశక్తి-గాలివీడు



నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా బుక్కే రామానుజన్ నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కలికిరి నుంచి తాను ఇక్కడికి బదిలీపై వచ్చానని చెప్పారు. నూలివీడు గ్రామ పరిధిలో ఉన్న ప్రజలకు తన వంతు వైద్య సేవలందించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



కలెక్టర్‌కు వాటర్ కూలర్లను అందజేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

కలెక్టరేట్‌కు వాటర్ కూలర్లు వితరణ

ప్రజాశక్తి - రాయచోటి

కలెక్టరేట్ సముదాయానికి నాలుగుయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక భాధ్యతతో కలెక్టరేట్ కార్యాలయ సముదాయానికి నాలుగు వాటర్ కూలర్లను యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు, సందర్శలకోసం వాటర్ కూలర్లను యూనియన్ బ్యాంక్ సామాజిక బాధ్యతలతో భాగంగా వితరణ చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బ్యాంక్ సేవలు, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వ్యవసాయ, సుక్ష్మ, చిన్న తరహా పరశ్రమలకు రుణాలు, స్వయం సహాయక బృందాలకు రుణాలు సత్వరమే అందిస్తున్నందుకు బ్యాంక్ సేవలను కలెక్టర్ కొనియాడారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు, ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉండేలా వాటర్ కూలర్‌ను వితరణ చేశామని యూనియన్ ఎస్‌బిఐ రీజనల్ హెడ్ బి.భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ బి.భాస్కర్, యూనియన్ బ్యాంక్ రాయచోటి శాఖాధిపతులు వీరేశ, ప్రసాద్, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కెంపే గౌడ జయంతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బెంగళూరు మహానగర నిర్మాతైన మొరుసు కాపుకు చెందిన కెంపే గౌడ 514వ జయంతి వేడుకలను తంబళ్లపల్లి నియోజకవర్గం సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పలురువు నాయకులు పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో నిర్వహించే జయంతి వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మురుసు కాపు నాయకులు ఎన్నారై కదిరినాయునికోట జయచంద్రారెడ్డి, ఎం.ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, పి.శ్రీనాథ్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, మార్కురి ఆంజనేయరెడ్డి, గిరిధర్‌రెడ్డి, శివారెడ్డి, రెడ్డప్పరెడ్డి, నరసింహారెడ్డి, జయ భారత్‌రెడ్డి, మాధవరెడ్డి, భయ్యారెడ్డి, రమేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి, అక్రమాలపై విచారించండి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని ఎస్.కొత్తపల్లి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని ఆ గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మహిళలు సోమవారం ఎంపిడిఒ ఎ.జాషువాకు వినతి పత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ 18 సంవత్సరాలుగా ఉపాధి కూలీలపై పెతనం చలా ఇస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతుందని ఆమెపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.



విజయవాడకు తరలి వెళుతున్న దళితులు

చలో విజయవాడకు తరలిన దళితులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఈనెల 27న చలో మంగళగిరి పేరుతో తలపెట్టిన మాలల ఆత్మీయ సమావేశానికి రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి దాదాపు 3వేల మందికి పైగా మాలలను విజయవాడకు తరలించనున్నట్లు రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంకాలం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాలలకు ఏమి చేశారని ఆయన ప్రశ్నించారు, గత నాలుగేళ్ల కాలంలో మాలలపై దాడులు, హత్యలు జరిగాయని ఏనాడైనా ముఖ్యమంత్రి మాలల గురించి మాట్లాడారా అని అన్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ అధిష్టానం అధికారంలో ఉన్న వైసిపిని దూరం చేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. రాబోయే ఎన్నికలలో మాలలు ఏకతాటిపై నిలబడి తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు. తద్వారా రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా మాలలు పనిచేసే విధంగా ప్రణాళికను ఏర్పాటు చేయనున్నట్లు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ఆయన సుడిగాలి పర్యటన చేసి మాలలను సోమవారం సాయంత్రం బస్సుల ద్వారా తరలిస్తున్నామని పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై దృష్టి సాధించాలని వినతి

ప్రజాశక్తి- కలకడ

మండల అభివృద్ధిపై దృష్టి సాధించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డిలకు వినతి పత్రం సమర్పించారు. సోమవారం గుర్రంకొండ మండలం సరిమడుగు పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసినట్టు తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేందుకు తమ సహకారం మాకు ఎంత అవసరమని కోరినట్లు తెలిపారు. మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేసి, నిధులను తెప్పించి మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమరి సహకారం ఎంతో అవసరమని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు కిషోర్, నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.



ఎంపీని సన్మానిస్తున్న ఎంపిపి శ్రీదేవి

జగనన్న ఇళ్ల మంజూరులో అవకతవకలు

- మంజూరు ఒకరికి.. ప్లాటు కేటాయింపు మరొకరికి
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- ఏడాది దాటినా పరిష్కారం చూపని అధికారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గూడులేని నిరుపేదలకు గూడు నిర్మించాలన్న సత్సంకల్పంతో 'జగనన్న ఇళ్లు' పథకంలో అవకతవకలు చోటు చేసుకున్నాయి. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోంది. ఒకరికి కేటాయించిన స్థలాన్ని వేరేకొకరి కట్టబెట్టిన సంఘటనలు మండలంలో చోటు చేసుకున్నాయి. అర్హులైన లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. బాధితులు ఏడాదికి పైగా రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పరిష్కారం కాని సమస్యగా మిగిలిపోయింది.

పట్టణంలోని కొలిమి వీధిలో అద్దె ఇంటిలో నివాసం ఉండే షేక్ నసీమ్ భాను అనే మహిళ ఏడాది క్రితం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఇళ్లు పథకానికి దరఖాస్తు చేసుకోగా బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న లేఅవుట్లలో 466 ప్లాట్ నెంబర్ కేటాయిస్తూ ఆన్‌లైన్‌లో తన పేరిట మంజూరైంది. తనకు కేటాయించిన ప్లాట్ నెంబర్‌తో ఇతరులకు స్థలం కేటాయించారని నసీం భాను ఆవేదన చెందుతున్నారు. తనకు జరిగిన అన్యాయంపై రెవెన్యూ అధికారులను కలిస్తే మరలా దరఖాస్తు చేసుకోమన్నారు. రెండవసారి దరఖాస్తు చేసుకుని సుమారు 6 నెలలు దాటినా తనకు స్థలం మంజూరు కాలేదు. గత ఏడాది నవంబర్‌లో తహశీల్దారును కలిసి మొరపెట్టుకున్నారు. అయినా సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ భాస్కర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఒకసారి తన పేరిట ఆన్‌లైన్లఓ ఇళ్లు మంజూరైన తర్వాత మరలా దరఖాస్తు చేసుకున్నప్పటికీ స్థలం మంజూరు కాదని రెవెన్యూ అధికారులు అన్నారని నసీం భాను ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన ఓ నిరుపేద మైనారిటీ మహిళకు జరిగిన తీవ్ర అన్యాయం పైన ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించి తన చిరకాలవాంఛ అయిన సొంతింటి కల నెరవేర్చాలని ఆ మహిళ అధికారులను వేడుకొంటోంది.



ఆర్‌డిఒకు స్పందనలో ఫిర్యాదు చేస్తున్న నసీం భాను

తప్పకుండా న్యాయం చేస్తాం

తన ఆధార్ నెంబర్ పైన స్థలం మంజూరైన తర్వాత అది ఇతరులకు కేటాయించడానికి ఉండదని, సాంకేతిక సమస్యలతో తలెత్తిన ఈ సమస్యకు పరిష్కారం చూపుతాం. షేక్ నసీం భాను స్పందనలో ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించి అత్యంత వేగంగా సమస్యను పరిష్కరించి మహిళకు స్థలం కేటాయించాలని తహశీల్దారుకు ఉత్తర్వులు జారీ చేశాం.

- భాస్కర్, ఆర్‌డిఒ, రాజంపేట.

మాదక ద్రవ్యాల వినియోగం హానికరం : సిఐ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పీలేరు

యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పులిచెర్ల సిఐ శ్రీనివాసమూర్తి తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పీలేరులోని ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేటి యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వారి లక్ష్యాలు, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల మత్తులో అనేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో కల్లూరు ఎస్ఐ బి.రవి ప్రకాష్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ, సిఐ మోహన్‌రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయి మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.వాటిని ఉపయోగించే చాల మంది వ్యక్తులు సమాజంలో ఒక కళంకాన్ని, వివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజరు సుమలత, బిస్మిల్లా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బోధసావలి, ఆటో వర్కర్స్, కోర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తుకు పునాది యువత : జడ్జి లత

ప్రజాశక్తి-నందలూరు

దేశ భవిష్యత్తుకు పునాది యువతని నందలూరు జూనియర్ సివిల్ జడ్జ్ కె.లత అన్నారు. సోమవారం కోర్టు ఆవరణ నందు "ఇంటర్నేషనల్ డే ఎగైనెస్ట్ డ్రగ్స్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫిక్కింగ్" కి సంబంధించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకి ముఖ్యమైన పునాధి పిల్లలు కనక వారి టీనేజ్‌లో ఎటువంటి డ్రగ్స్‌కి ఆకర్షితులు కాకుండా ఉండాలంటే తల్లిదండ్రులు పాత్ర, టీచర్లు పాత్ర, గవర్నమెంట్ పాత్ర ఏంటి అనేది తెలియజేశారు. మాదకద్రవ్యాలను సరఫరా చేసేవారు యువకులు టార్గెట్ చేస్తారని ఈ సరఫరా ఒక చైన్ లాగా జరుగుతుందని తెలిపారు. యుక్త వయసులో ఉన్న వారి పక్కన ఉన్నవారు ఒత్తిడి చేయడం వలన వారు డ్రగ్స్‌కి ఆకర్షితులైతే ఆ డ్రగ్స్‌ని సేవించాలని కోరికతో ఒకసారి వాడటం వల్ల తర్వాత ఆ కోరికలు అదుపు చేయలేకపోవడం వల్ల అలా వారు బానిసలు అవుతారని తర్వాత దాన్ని ఆపలేకపోతుంటారని తెలియజేశారు. ఫ్యామిలీ ప్రెషర్ ఎడ్యుకేషనల్ ప్రెషర్, ఉద్యోగం రాలేదని ప్రేషార్ వలన ఈ మత్తుకు బానిసలు అవుతుంటారు, ఆల్కహాల్ తీసుకోవడం వలన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రోడ్డు ట్రాఫిక్ యాక్సిడెంట్ లో ఇన్వాల్వ్ అవుతున్నారని తెలియజేశారు. డ్రగ్స్ తీసుకొనడం వలన యువత నేరాలను ఆహ్వానిస్తున్నారని, ఒకసారి డ్రగ్స్‌కి బానిసై ఎటువంటి నేరాలు అయినా చేయడానికి ఇష్టపడుతుంటారని తెలియజేశారు. లిక్విడ్ గంజా మెదడుపై ప్రభావం చూపిస్తాయని, రక్తపోటు గుండెజబ్బులు వచ్చే అవకాశం ఉన్నయని తెలియజేశారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న మెడిసిన్స్ వాడటం వలన కౌన్సెలింగ్ ద్వారా డ్రగ్స్ కి బానిసలైన వారిని ఆ విషయం నుంచి బయట పడేయవచ్చు అని తెలియజేశారు. ప్రతి ఒక్క విద్యార్థికి అవేర్నెస్ కల్పించాలని డ్రగ్స్ వాట వల్ల జరిగే పరిణామాలు వారికి తెలియజేయాలని తెలిపారు. ఈ అవగాన సదస్సులో భాగంగా కోర్టు నుండి నాగిరెడ్డిపల్లి వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి నరసింహులు, టి.లక్ష్మీనారాయణ, హెచ్.ఆనంద్ కుమార్, ఎస్.మహమ్మద్ అలీ, సెమీవుల ఖాన్, జి.సుబ్బరామయ్య, పోలీసులు సిబ్బంది, కోర్టు సిబ్బంది, పిఎల్‌విలు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లత

'జగనన్నకు చెబుదాం' అర్జీలను పరిష్కరించండి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజలలో సంతృప్తి స్థాయి పెరిగేలా జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ గిరీషఅధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరుతోపాటు జెసి ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఇఒ సత్యానారాయణ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతగా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు బాధ్యతాయుతంగా విజయవంతం చేయాలన్నారు. జగనన్న సురక్ష సర్వీసెస్‌పై సర్వే బాగా చేస్తున్నారని, జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియామకం చేశామని మండలాలలో జరుగుతున్న ఈ కార్యక్రమం అమలుపై ఎప్పటికప్పుడూ పర్యవేక్షించి వందశాతం సర్వీస్ రిక్వెస్ట్‌లు అప్లోడ్ అయ్యేలా చూడాలని కలెక్టరు పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో భాగంగా వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్పందన, రీ–సర్వే, ఎలక్షన్స్, గ్రామ వార్డు సచివాలయాలు, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ గిరీష పి.ఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిసాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా స్పందన ఆర్జీలను ప్రజలలో సంతృప్తికర స్థాయి పెరిగేలా పరిష్కరించాలన్నారు. విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంట్ పంపాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో రీఓపెన్ అయిన అర్జీలపై ఆయా శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్పందన అర్జీలను ప్రతి అధికారి సీరియస్‌గా తీసుకొని పరిష్కరించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వస్తున్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి పరిష్కరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్ దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి పెండింగ్ లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు .ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, డిపిఒ ధనలక్ష్మి, హౌసింగ్ పీడీ శీనయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఎస్‌పి గంగాధర్‌రావు

తేక్వాండోలో విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - రాయచోటి

తమ విద్యార్థులు రజక పతకాలకు ఎంపికయ్యారని పట్టణానికి చెందిన సింగర బ్రదర్స్ తేక్వాండో అకాడమీ మాస్టర్ సాంబశివయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 25న రైల్వేకోడూరులో ఎపి తేక్వాండో అసోసియేషన్ చైర్మన్, కడప అసో చైర్మన్, కడప ఉమ్మడి జిల్లా సెక్రెటరీ గ్రాండ్ మాస్టర్ నాగూరి బాబు ఆదేశా మేరకు రైల్వే కోడూరు ఆర్ఎస్ స్పోర్ట్స్ క్లబ్ రవి శంకర్ ఆధ్వర్యంలో క్యాడెట్ , జూనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారన్నారు. పోటీలలో రాయచోటికి చెందిన సింగర బ్రదర్స్ తేకాండో అకాడమీకి చెంది న రెడ్డియ్య, సాయి కార్తిక్, బాసు, రెడ్డి మల్లేష్, ఉజ్వల్ ఐదుగురు క్రీడాకారులు బంగారు పతకాలు, మహమ్మద్ రయాన్, గౌతం రెడ్డి, అజాన్, జ్ఞానేంద్ర అను క్రీడాకారులు రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎస్‌పి పి.గంగాధరరావు అభినందించారన్నారు. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనపరచి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాధించిపెట్టాలని కొనియాడారు.

ఆదుకోవడం కనీస ధర్మం


ప్రజాశక్తి-గాలివీడు

ఆపదలో ఉన్న వారినిక యువకులు ఆదుకోవడం కనీస ధర్మమని షేక్ జిన్న సేవా సంస్థ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నివాసముంటున్న చిన్నబాష అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో అతని వైద్య కోసం రూ. 6 లక్షలు అవసరం కాగా అతన్ని సంస్థ ఆధ్వర్యంలో వైసిపి నాయకులతో కలిసి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లి యదు భూషణ్ రెడ్డి, వైసిపి మైనార్టీ నాయకుడు ఎస్.కె ఖాదర్ మోదిన్ వైసిపి మైనార్టీ యువ నాయకుడు ఎస్.కె.నిజాముద్దీన్ ఆరిపుల్ల తఫజుల్ హుస్సేన్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంపై దర్యాప్తు జరిపించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పెనగలూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ అన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోలి శివకుమార్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్ని ప్రమాదానికి కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసులు, నియోజకవర్గ నాయకులు వంశీకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.



రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్పెంటర్లు

కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఆర్ఆర్

రాయచోటి: కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్. రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బోస్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాయచోటి పట్టణానికి చెందిన కార్పెంటర్లు అన్నమయ్య జిల్లా కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు రమేష్ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్ వలి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, మైనార్టీ నాయకులు అథావుళ్ళ,షేక్ జిలాన్, బాబ్జి, రసూల్, వెంకటరమణ, మోహన్ ఆచారి, కె మని, నూరుద్దీన్, ముబారక్, అమీర్‌బాష, హరిబాబు ఆచారి, హనీఫ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై సమీక్ష

రామాపురం: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న సురక్షకు సంబంధించి మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్‌పిటిసి, మార్కెట్ కమిటీ చైర్మన్, సర్పంచులకు, ఎంపిటిసిలకు కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. జులై 1 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన పంచాయతీలో మంజూరైన రూ. 20 లక్షల నిధులు ద్వారా త్వరగా పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మానస వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఎంపిడిఒ హైదర్‌వలి, మండల ఇంజినీర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **నందలూరు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష విజయవంతం కావాలని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సచివాలయాలను ఆయనతో పాటు తహశీల్దార్ సదానందం, ఎంపిడిఒ సౌభాగ్యమ్మ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉపయోగించుకునేలా ఇంటింఃటికి వెళ్లి ప్రజలలో అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల సచివాలయాల ఇన్‌ఛార్జి కన్వీనర్ కలీముల్లా ఖాన్, వక్ఫ్ బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సర్పంచ్ మోహన్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీను, శంకరన్న, నాగిరెడ్డిపల్లి 1 పంచాయతీ సెక్రెటరీ రెడ్డి, బిసి నాయకులు శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు. **కలికిరి:** జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సును మండలం మర్రికుంటపల్లిలో వైసిపి నాయకులు మద్దిరాల మల్లికార్జున సోమవారం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల లెవెల్ అధికారి జాకీర్, పంచాయతీ కార్యదర్శి వి.గాయత్రి, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు మద్దిరాల మల్లికార్జున, వీరం రెడ్డి గారి రామిరెడ్డి, మరియు వాలంటీర్ల బృందం పాల్గొన్నారు.

ఆర్‌బికెలో జెడి ఆకస్మిక తనిఖీ

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లి రైతు భరోసా కేంద్రంలో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్ ఇకెవైసి పెండింగ్ ఉన్న రైతులందరూ తక్షణమే పూర్తి చేసుకోవాలని కోరారు. వైయస్సార్ యంత్ర సేవ పథకం కింద ఆర్‌బికె పరిధిలోని వ్యవసాయ పరికరాలను వినియోగించుకోవాలన్నారు. గ్రామంలోని కౌలు రైతులు అందర్నీ గుర్తించి వెంటనే వారికి కౌలు కార్డులు అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒలు వెంకట మోహన్, రమేష్‌రాజు, ఎఇఒ కవిత, ఆర్‌బికె సిబ్బంది లక్ష్మీదేవి పాల్గొన్నారు.



వ్యవసాయాధికారులు, ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న జెడి చంద్ర నాయక్

కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలి

- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖ బేగం

ప్రజాశక్తి నిమ్మనపల్లె

ప్రజలందరూ కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖ బేగం అన్నారు. కుష్టు వ్యాది కేసుల గుర్తింపు కార్యక్రమం (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్–ఎల్‌సిడిసి) ఈ నెల 26వ తేదీ నుంచి జూలై నెల 16వ తేదీ వరకు ప్రతి ఒక్కరిని పరీక్షించి స్పర్శలేని మచ్చలువున్న వారిని గుర్తించడం జరుగుతున్నాదని తెలిపారు. స్పర్శ లేని మచ్చలు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు రావటం, శరీరంపై నొప్పిలేని బుడుపులు ఏర్పడటం వంటి కుష్టి వ్యాధి లక్షణాలను గమనించిన వ్యక్తులు స్థానిక పిహెచ్‌సిలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇందుకు మండలంలోని 12 సచివాలయాల పరిధిలో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టీమ్‌లో ఆశా కార్యకర్త, వాలంటీరు, సంబంధిత ఏరియా ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు పర్యవేక్షకులుగా వుంటారన్నారు. మండలపరిధిలో కుష్టి వ్యాధి పై అవగాహన కల్పించి, కుష్టి వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా ఏ ఒక్క అనుమానిత కుష్టు వ్యాది కేసు వదలకుండా క్షుణ్ణంగా గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.